www.dainamicnews.com
శుభోదయ
# డైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com



విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089



తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | వెల : 4/-


## అధికారంలో లేకున్నా
# తగ్గని జోరు

- బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు
- ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు పెరిగిన విరాళాలు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.4 కోట్లుగా నమోదు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన పార్టీ ఫండ్స్
- ఈసీకి సమర్పించిన నివేదికలో వెల్లడించిన బీఆర్ఎస్
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారిన పరిణామం



హైదరాబాద్

తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు - మిగతా3లో



## మహిళలను ఇళ్లలో బంధించడం సమస్యకు పరిష్కారం కాదు

- జెన్‌జీ గళం విప్పాలి: రాహుల్
- మహిళలకు మరింత భద్రత కల్పించాలని నిరసనలు చేస్తున్న విద్యార్థులు
- వారికి మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- జెన్‌జీ యువతులు ఈ నిరసనల్లో పాల్గొనాలని పిలుపు

## ప్రధాన పార్టీలకు
# సెమీ ఫైనల్‌గా ఖైరతాబాద్

- సర్' తర్వాత జరిగే తొలి ఎన్నిక!
- ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు శాసనసభ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్
- ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఈ ఉప ఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నాయి.
- గెలుపు కోసం వ్యూహాలు




హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఖైరతాబాద్ ఉప ఎన్నికను సెమీఫైనల్‌గా భావిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు, తమ రాజకీయ చతురతను తేల్చుకోవడానికి సిద్ధం అవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ గెలిచిన కాంగ్రెస్, ఖైరతాబాద్‌లోనూ విజయం సాధించి హైదరాబాద్ నగరంలో పట్టును నిరూపించుకోవాలన్న వ్యూహంతో ఉంది. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్‌ను గెలుచుకున్న బీఆర్ఎస్ తిరిగి ఈ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర రాజకీయాలకు బలంగా ఓ సంకేతాన్ని పంపాలని భావిస్తోంది. తెలంగాణలో అధికారం సాధించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్న బీజేపీ ఉప ఎన్నికలో గెలిచి కేడర్‌ను ఉత్సాహపరచాలని ప్రయత్నాలు చేస్తోంది. - మిగతా3లో

## దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు




- ఆరుగురు అరెస్ట్- కీలక పత్రాలు, ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు చెప్పిన జాతీయ దర్యాప్తు సంస్థ
- ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

## సిరిసిల్లలో రేవంత్ అసలు
# టార్గెట్ ఇదేనా?

- కేటీఆర్ కోటనే ఎందుకు ఎంచుకున్నారు?
- సిరిసిల్ల స్థానంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు
- సుమారు రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్
- కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం



హైదరాబాద్

తెలంగాణ రాజకీయం ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నాయకుల సొంత నియోజకవర్గాల చుట్టూ తిరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా నాలుగుసార్లు ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల స్థానంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభను కాంగ్రెస్ ప్లాన్ చేసింది. పదేళ్ల పాలనలో కేటీఆర్ సిరిసిల్లను ఆదర్శంగా తీర్చిదిద్దామని చెప్పుకుంటుంటే, నాలుగుసార్లు గెలిపించిన ప్రజలకు సరైన అభివృద్ధి చేయలేదు అని రేవంత్ ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది. - మిగతా3లో

## వివక్ష, దాడులపై దళితులు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలి

- భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు అయినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయి
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- తమ ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం దళితులు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది
- దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది
- బీజేపీ పాలనలో దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోంది



న్యూఢిల్లీ

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు అయినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం దళితులు, ఆదివాసీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, వివేక్ వెంకటస్వామి, - మిగతా3లో



## 'తరంగ్ శక్తి' విన్యాసాల్లో అమెరికా ఏఫ్-35 యుద్ధ విమానాలు ఎంట్రీ

- హర్షం వ్యక్తం చేసిన యూఎస్ ఎంబసీ
- సెప్టెంబర్ 26-అక్టోబర్ 12 వరకు రాజస్థాన్‌లో 'తరంగ్ శక్తి' విన్యాసాలు
- ఈ సైనిక విన్యాసాల్లో యూఎస్‌కు చెందిన ఏఫ్-35 యుద్ధ విమానాలు అరంగేట్రం
- భారత్‌లోని అమెరికా ఎంబసీ పోస్ట్




## భారత్- చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయి

- సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని వెల్లడి
- న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్




## మోదీ రాజీనామా చేయాలి

- సీఈసీని వెంటనే తొలగించాలి: కాంగ్రెస్ డిమాండ్
- ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని సీడబ్ల్యూసీ డిమాండ్
- తొలగించిన 13.30 కోట్ల ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని కోరిన కాంగ్రెస్
- దేశవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు చేపడతామని ప్రకటన

# చెన్నై పాలెంలో భూమి డిజిటలైజేషన్ సర్వే గ్రామ సభ...!

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:



**శుభోదయం డైనమిక్ న్యూస్ మఠంపల్లి** : మఠంపల్లి మండలం చెన్నయ్యపాలెం గ్రామంలో సర్పంచ్ భూక్య రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూమి డిజిటలైజేషన్ సర్వే గ్రామసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన అయినా లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డుల ను పంపిణీ చేశారు. గ్రామస్తుల సమక్షంలో భూములకు సంబంధించిన వివరాలల్లో పారదర్శకత పెంచడంతో పాటు భవిష్యత్తులో ప్రజలకు అవసరమైన సేవలను వేగంగా అందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని వివరించారు. సర్వే సమయంలో రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ప్రాధాన్యతను అధికారులు వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ల సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ భూక్య రవీంద్ర నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అందించేందుకు పంచాయతీ తరుపున సహకారం అందిస్తామని తెలిపారు. భూమి డిజిటలైజేషన్ సర్వే గ్రామస్తులు ఉపయోగకరంగా ఉండేలా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తారని పేర్కొన్నారు గ్రామ ప్రజలు సర్వేకు అవసరమైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోతు నాగు, ఉప సర్పంచ్ భూక్య నాగు నాయక్, ఆర్ ఐ జానీ, ఓపిఓ అశోక్, పంచాయతీ కార్యదర్శి మట్టయ్య, వార్డు సభ్యులు భూక్య గోవర్ధన్ నాయక్, బానోతు క్రాంతి, బానోతు నాగార్జున, బానోతు లక్ష్మ తదితరులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మోదీ రాజీనామా చేయాలి




ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాలో మార్పులపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై ప్రధానికి పూర్తి సమాచారం ఉందని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందని అన్నారు. ప్రధాని పదవిలో కొనసాగేందుకు మోదీకి నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు హాజరయ్యారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్‌పై ప్రధానంగా చర్చించారు. మొత్తం 68 మంది సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

**‘సీఈసీని తొలగించాలి’**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సీఈసీకి ఇకపై నైతిక, సంస్థాగత అధికారం లేదని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని కూడా కోరింది. ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితాలో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపించింది. తొలగించినట్లు చెబుతున్న 13 కోట్ల 30 లక్షల మంది ఓటర్ల పేర్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కోరింది.

**‘మ్యాచ్ ఫిక్సింగ్ ఎన్నికలు’**

ఎన్నికల సంఘం, ప్రధాని–హోంమంత్రి వ్యవస్థ మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ జరుగుతోందని జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగడం లేదని అన్నారు. ఎన్నికలపై రాహుల్ గాంధీ గతంలో లేవనెత్తిన అంశాలు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని చెప్పారు. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి రాహుల్ గాంధీ గతంలో పలు ప్రశ్నలు లేవనెత్తారని జైరాం రమేశ్ తెలిపారు. గత 18–19 నెలలుగా ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై రాహుల్ గాంధీ ఆధారాలను ప్రజల ముందు ఉంచుతున్నారని చెప్పారు.

ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై గత పది నెలల్లో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఓ మీడియా కథనం పేర్కొంది. ఈ అంశాన్ని కూడా కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు క్యాబినెట్ కార్యదర్శికి తమ అభిప్రాయాలను తెలియజేశారని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఈ విషయం ప్రధాని దృష్టికి కూడా వెళ్లిందని చెప్పారు.

ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై ప్రధానికి సమాచారం ఉన్నందున, ఈ విషయంలో ఆయన జోక్యం చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్ చర్యలు ప్రధాని నరేంద్ర మోదీ సమ్మతి లేకుండా జరిగే అవకాశం లేదని ఆరోపించారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం తమ నిర్ణయాలన్నీ చట్టపరమైన ప్రక్రియ ప్రకారమే జరుగుతున్నా యని చెబుతోంది. ఒక సంస్థలో నిర్ణయాలు తీసుకునే సమయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలకు చట్టపరమైన ఆధారం ఉందని పేర్కొంది.

**దేశవ్యాప్తంగా నిరసనలు**

ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ ఇకపై దేశవ్యాప్తంగా ఉద్యమించాలని నిర్ణయించింది. పార్లమెంట్‌లో, కోర్టుల్లో, ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని సీడబ్ల్యూసీ తీర్మానంలో పేర్కొంది. శాంతియుతంగా, కానీ తీవ్ర స్థాయిలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలపై బుధవారం కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు సమావేశం కానున్నాయి. ఆ సమావేశంలో తదుపరి కార్యాచరణపై ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది.

# దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు




అసోం, బంగాల్, కేరళ రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ మంగళవారం సోదాలు చేపట్టింది. ‘జమాత్–ఉల్–ముజాహిదీన్ బంగ్లాదేశ్’ (జేఎంబీ)కు అనుబంధంగా ఉన్న ‘ఇమామ్ మహ్ముదర్ కఫిలా’ కు సంబంధించిన ఉగ్రవాద కుట్ర, అసోంలో యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లింపుపై ఈ సోదాలు నిర్వహించింది. మొత్తం 16 ప్రాంతాల్లో 10 అసోంలో, 5 బంగాల్‌లో ఒకటి కేరళలో ఉన్నాయి. విచారణ కోసం అసోంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఐఎంకే పన్నిన ఉగ్రవాద కుట్రకు సంబంధించి 11 మంది నిందితులపై ఎన్ఐఏ అభియోగాలు నమోదు చేసిన మూడు నెలల తర్వాత సోదాలు నిర్వహించింది. అసోంలోని బార్‌పేట జిల్లాలో, ఆజాద్ నగర్ నిచుకా ప్రాంతాల్లోని పలు చోట్ల ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. విచారణ కోసం అస్సాంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారిని సోర్భోగ్‌కు చెందిన ఫరూక్ అబ్దుల్లా, జాకీర్ హుస్సేన్, చాంద్‌బార్ అలీ, బార్పేట రోడ్‌కు చెందిన ముస్తఫిజుర్ రెహమాన్, నిషుకాకు చెందిన యాకూబ్ అలీ, హౌలీలోని జషిహతిపరా గ్రామానికి చెందిన రకీబుల్ ఇస్లాంలుగా గుర్తించారు. ఈ ఆపరేషన్ సమయంలో అనేక కీలకమైన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

మరోవైపు బంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పుర్ జిల్లా కుష్మారి ముందేహర్ గ్రామానికి చెందిన ముజిబుర్ రెహమాన్ (26) ఇంటిపై ‘జమాత్–ఉల్–ముజాహిదీన్’ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహించారు. ముజిబుర్ ఇంటికి దూరంగా ఉండి చదువుకుంటుండగా, జనవరిలో పోలీసులు తమ ఇంటికి వచ్చి అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని అతడి తండ్రి మిజానూర్ రెహమాన్ చెప్పారు. అప్పటి నుంచి ముజిబుర్ పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఆచూకీ గానీ, కార్యకలాపాల గురించి గానీ ఎవరికీ తెలియదు. ఎన్ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, ముజిబుర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, నిందితుడి కుటుంబ సభ్యులు, స్థానికులు మాత్రం, అతడు తన ఉన్నత చదువులతో పాటు ఖురాజ పరీక్షకు కూడా సన్నద్ధమవుతున్నాడని అంటున్నారు. గత జనవరి వరకు అతడు ఇంట్లోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత అతడి ఆచూకీ లేకుండా పోయింది. సుమారు ఏడు లేదా ఎనిమిది నెలల క్రితం పోలీసులు అతడి నివాసంలో సోదాలు నిర్వహించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. బంగాల్, అసోం, త్రిపురతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద భావజాలాన్ని విస్తరించేందుకు ఐఎంకే పన్నిన కుట్రలో నిందితులు చురుకుగా పాల్గొన్నట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ కుట్రలో ఉగ్రవాద సంస్థ ఎజెండాను ప్రచారం చేయడం, సులభంగా ప్రభావితమయ్యే యువతను తీవ్రవాదం వైపు మళ్లించడం, భారతదేశంలో ఆ సంస్థ నెట్‌వర్క్‌ను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుంది. గువాహటిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో నిందితులపై ‘భారతీయ న్యాయ సంహిత–2023’, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–1967’లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. భారత్‌లో నిషేధిత సంస్థ జేఎంబీ దుర్మార్గపు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, ఆ సంస్థకు చెందిన సీనియర్ సభ్యుడు ఇమామ్ మహమూద్ హబీబుల్లా ‘ఐఎంకే ని స్థాపించినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. రహస్య సమావేశాలు, మతపరమైన భావజాల ప్రచారం, తీవ్రవాద సాహిత్యాన్ని పంపిణీ, ఐఎంకే/జెఎంబి నాయకత్వానికి మద్దతుగా భారత్‌కు వ్యతిరేకంగా డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ మార్గాల ద్వారా భారతదేశంలో ఐఎంకే/జెఎంబి ఉనికిని విస్తరించడానికి ఈ 11 మంది నిందితులు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు 45 రోజుల ఉచిత శిక్షణ



**సూర్యాపేట బ్యూరో,శుభోదయ డైనమిక్** సూర్యాపేట జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, పౌష్టికాహారంతో భోజనం, రాత పరీక్షకు ప్రత్యేక తరగతులు, ఫిజికల్ ఈవెంట్స్‌లో శిక్షణ అందించనున్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు .

## బాలల సంరక్షణపై అధికారులకు అవగాహన



**సూర్యాపేట బ్యూరో,శుభోదయ డైనమిక్** యూనిసెఫ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, పిల్లల సమస్యల పరిష్కారంపై జిల్లా స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, డ్రగ్స్ నివారణ, శాఖల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రతి శాఖ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. యూనిసెఫ్ రిసోర్స్ పర్సన్ ఫిలిప్స్ అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, అధికారులు పాల్గొన్నారు.

## 100 రోజుల్లో 60 వేల మంది విద్యార్థులకు పౌష్టికాహారం



**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** సూర్యాపేట జిల్లా మునగాల మండలం సయ్యద్ ముజావర్‌పేటలో కేంద్రీకృత వంటశాలను నిర్మిస్తున్నారు. సింగరేణి సంస్థ రూ.9.60 కోట్ల సహాయంతో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వంటశాలను 100 రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని ద్వారా సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సుమారు 60 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించనున్నారు. నల్లగొండ జిల్లాలోని నాలుగు మండలాల్లో 7,972 మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. పరిశుభ్రత, నాణ్యత, పోషక విలువలు, నిర్ణీత సమయానికి ఆహారం అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** .కేసుల దర్యాప్తులో ఎస్ఓపీ నిబంధనలు పాటిస్తూ, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బాలలపై నేరాలు, చీటింగ్, దాడి కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాక్ష్యాల సేకరణలో జాప్యం లేకుండా చార్జిషీట్లు దాఖలు చేయాలని, బాధితులకు త్వరగా న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ‘తరంగ్ శక్తి’ విన్యాసాల్లో అమెరికా ఏఫ్-35 యుద్ధ విమానాలు ఎంట్రీ

భారత్‌లో జరుగుతున్న ‘తరంగ్ శక్తి 2026’ విన్యాసాల్లో అమెరికా వైమానిక దళానికి చెందిన ఎఫ్–35ఏ లైట్నింగ్ ఐఐ స్టెల్త్ ఫైటర్ జెట్‌లు చరిత్రాత్మకంగా పాల్గొనడంపై ఇండియాలోని యూఎస్ ఎంబసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ అధునాతన విమానం భారత గగనతలంలోలోకి అడుగుపెట్టిందని పేర్కొంది. ఎఫ్–35ఏ విమానాలు తరంగ్ శక్తి విన్యాసాల్లో భాగంగా భారత్‌లో తమ తొలి అడుగు వేస్తున్నాయని వెల్లడించింది. అదే సమయంలో ఈ విమానం అసాధారణ సామర్థ్యాలను, అలాగే భారత వైమానిక దళం (ఐఏఎఫ్), దాని మిత్ర దేశాల ఎయిర్‌ఫోర్స్‌లతో కలిసి ఇది సృష్టించే విలువైన ద్వైపాక్షిక శిక్షణా అవకాశాలను కూడా చెప్పింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో భారత్‌లోని యూఎస్ ఎంబసీ పోస్ట్ పెట్టింది. “అమెరికా వైమానిక దళానికి చెందిన ఎఫ్–35ఏ లైట్నింగ్ ఐఐ స్టెల్త్ ఫైటర్ జెట్‌లు తరంగ్ శక్తి– 2026లో పాల్గొన్నాయి. తద్వారా ఈ అధునాతన విమానం భారత గగనతలంలో తొలిసారిగా కార్యాచరణలోకి దిగింది. స్టెల్త్, అధునాతన సెన్సార్లు, సమాచార భాగస్వామ్య సామర్థ్యాలను కలపడం ద్వారా ఎఫ్–35 విమానాలు భారత వైమానిక దళం, ఇతర భాగస్వాములతో కలిసి శిక్షణ పొందేందుకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. తద్వారా రెండు దేశాల మధ్య సైనిక సహకారం, సమన్వయం, రక్షణ సంసిద్ధత మరింత బలపడుతుంది. “

**జోధ్‌పుర్ వేదికగా ‘తరంగ్ శక్తి’ విన్యాసాలు**

తరంగ్ శక్తి రెండో విడత విన్యాసాలు రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సెప్టెంబరు 26న ప్రారంభమయ్యాయి. అవి అక్టోబర్ 12 వరకు జరుగుతాయి. ‘పవర్ ఇన్ పార్ట్‌నర్‌షిప్’ (భాగస్వామ్యంలో శక్తి) అనే థీమ్‌తో ఈ ఏడాది ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాతో పాటు ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, యూఏఈలకు చెందిన వాయుసేన బృందాలు విన్యాసాల్లో పాల్గొంటాయని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మంగళవారం ప్రకటించింది. అలాగే ఇంకొన్ని దేశాలు పరిశీలకులుగా హాజరవుతాయని స్పష్టం చేసింది. దేశ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించడంతో పాటు వివిధ దేశాల వాయుసేనల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది.

**భారత్ తరఫున ఏయే విమానాలంటే?**

యూఎస్ ఎఫ్–35తో పాటు ఫ్రాన్స్ రఫేల్, యూఏఈ ఎఫ్–16, బంగ్లాదేశ్ సీ–130జే విమానాలు రెండు వారాలపాటు విన్యాసాలు చేపట్టనున్నాయి. భారత్ తరఫున రఫేల్, మిరాజ్–2000, జాగ్వార్, తేజస్, మిగ్–29, సుఖోయ్–30ఎంకేఐ తదితర విమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. ఏరో ఇండియా 2025లో ఎఫ్–35 (ఫ్‌–35) పాల్గొన్నప్పటికీ తరంగ్ శక్తిలో మాత్రం తొలిసారి ప్రదర్శన ఇదే. 2024లో జరిగిన తరంగ్

# చెత్తతో కంపుకొడుతున్న పెద్ద శంకరంపేట

## రోగాల భయంతో ప్రజలు.. చెరువు కాలుష్యంతో మత్స్యకారుల ఆవేదన





**పెద్ద శంకరంపేట, శుభోదయ డైనమిక్ వార్త, సెప్టెంబర్ 29** మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో చెత్త సమస్యపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట చెత్తను పేరుకుపోయేలా వదిలేయడంతో దుర్గంధం, ఈగలు, దోమల బెడద పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**రహదారి పక్కనే చెత్త కుప్పలు**

పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను గ్రామ శివారులోని రహదారి పక్కన వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, మహిళలు అదే మార్గంలో ప్రయాణించాల్సి వస్తోందని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిన చెత్త కారణంగా దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజారోగ్యంపై ఆందోళన**

చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు, చర్మ సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమస్యను అధికారులు వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**చెరువు కాలుష్యంతో మత్స్యకారుల ఆవేదన**

పెద్ద శంకరంపేట పెద్ద చెరువుపై ఆధారపడి సుమారు 140 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయని స్థానికులు తెలిపారు. చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను చెరువులో వేస్తున్నారని, దీంతో నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేపల పెంపకానికి పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల పాలవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి**

గ్రామానికి దూరంగా, ప్రజలకు ఇబ్బంది కలగని ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**స్పందించకపోతే కలెక్టర్‌ను ఆశ్రయిస్తాం**

అధికారులు తక్షణమే స్పందించి రహదారుల వెంట ఉన్న చెత్తను తొలగించి, డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే గ్రామస్థులు, మత్స్యకారులు, మహిళలు, యువకులతో కలిసి మెదక్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి పెద్ద శంకరంపేట పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# త్వరలోనే ఆర్టీసీ విలీన తేదీని ఖరారు చేయనున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### ఆర్టీసీ ఎన్నికల్లో మిత్రపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి



**శుభోదయ డైనమిక్ న్యూస్, సెప్టెంబర్ 29, సూర్యాపేట :** పదేళ్ళ తరువాత ఆర్టీసీలో జరిగే ఎన్నికలు ఎంతో ప్రాదాన్యత సంతరించుకున్నాయని ఈ ఎన్నికలతో ఆర్టీసీ విలీనం ముడిపడి ఉందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ ఎన్నికల ఇంచార్జ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టి డబ్ల్యు యూ రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్టీసీ ఎన్నికల్లో టీఎంయు బలపర్చిన ఎస్ డబ్ల్యు ఎఫ్, టిడబ్ల్యు ల ఐక్య కూటమికి కాంగ్రెస్ పార్టీ మద్దతు పలికిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీని విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దంగా ఉందని త్వరలోనే తేదీని కూడా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీని విలీనం చేసిన సందర్భంగా వచ్చిన సమస్యలు తెలంగాణాలో రాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ఒక కమిటీని వేశారని ఈ ఎన్నికల్లో గెలుపొందే ఆర్టీసీ కార్యవర్గంతో కలసి చర్చించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావాలంటే టీఎంయు బలపర్చిన ఎస్ డబ్ల్యుఎఫ్, టిడబ్ల్యుయు ఐక్య కూటమి బాణం, నక్షత్రం గుర్తులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ టీఎంయుకు మద్దతు ఇవ్వడం హర్షణీయమని ఆర్టీసీ సంస్థ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే లాభాల బాట పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు బాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాండు నాయక్, నాగు నాయక్, తొడుసు లింగయ్య, టీఎంయు రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ లతో పాటు నాయకులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏటీఎం దోపిడీకి యత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసిన డుండిగల్ పోలీసులు

### నేరానికి ఉపయోగించిన కారు, పలు పరికరాలను స్వాధీనం






**మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 29 శుభోదయ డైనమిక్:** ఏటీఎం దోపిడీకి యత్నించిన 26 ఏళ్ల వ్యక్తిని డుండిగల్ పోలీసులు సెప్టెంబర్ 27న అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన కారు, పలు పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లాకు చెందిన, ప్రస్తుతం మెద్చల్‌లోని సూరారంలో నివసిస్తున్న ఉంద్రసపు వీరబాబును ప్రత్యేక పోలీసు బృందం మెద్చల్ రోడ్డులోని బీఆర్ఎస్ భవన్ సమీపంలో అదుపులోకి తీసుకుంది.గండిమైసమ్మలోని యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ హెడ్ కె. విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెప్టెంబర్ 27న తెల్లవారుజామున 1:00 గంటలకు, 1:47 గంటలకు గండిమైసమ్మలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం (మెషిన్ ఐడీ: ఀజు=064340)ను నిందితుడు రెండుసార్లు ధ్వంసం చేసి చోరీకి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 6:20 గంటలకు బ్యాంకు సిబ్బంది ఏటీఎం వద్దకు చేరుకోగా పరికరాలు, పరిసరాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు.భద్రతా సిబ్బంది లేని ఏటీఎం కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని, రాత్రి వేళల్లో ప్రత్యేక పరికరాలతో నిందితుడు చోరీలకు ప్రయత్నించేవాడని డుండిగల్ డీఐ జి. రమేష్ నాయుడు తెలిపారు. ఏసీపీ మేద్చల్ డివిజన్ చ. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మారుతీ సుజుకీ కారు (౧+08౨7402)తో పాటు సుత్తి, కటింగ్ మెషిన్, పదునైన అంచు కలిగిన ఇనుప రాడ్, వైర్ కట్టింగ్ ప్లయర్స్, స్క్రూడ్రైవర్లు తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వేగవంతమైన దర్యాప్తు, కేసు ఛేదనను కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ అభినందించారు.

# వి జే ఐ టి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**మేడ్చల్- మల్కాజ్ గిరి సెప్టెంబర్ 29, శుభోదయ డైనమిక్ :** అజీజ్ నగర్ లోని విద్యా జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్. ఎస్. ఎస్ యూనిట్ మరియు సిఎస్సి-- డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో టి ఎక్స్ హాస్పిటల్స్ మరియు సిగ్మా ఐవేర్ సంయుక్తంగా వి జె ఐ టి క్యాంపస్‌లో ఉచిత సమగ్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని వి జే ఐ టి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన మాట్లాడుతూ కళాశాలలో ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలోని ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మానవ జీవితంలో జీవనశైలిని మార్చుకొని ఆరోగ్యవంతంగా జీవించడానికి ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కళాశాల డీన్ డా. ఎ. పద్మజ మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని సూచించారు. డైరెక్టర్ అకడమిక్స్ జి. శ్రీలత మాట్లాడుతూ రోజువారి జీవితంలో ఆరోగ్యవంతమైన ఆహారాలను, సేంద్రీయ పదార్థాలను నిత్యజీవితంలో వాడుకోవాలని అన్నారు. కళాశాల సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్. వెంకటాచలం మాట్లాడుతూ కళాశాలలో ఉచిత వైద్య శిబిరాలను యాజమాన్యం ప్రోత్సహిస్తుందని, ఉద్యోగులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలను కన్సల్టెంట్ వైద్యులు డా. పి. చక్రధర్ రెడ్డి, డా. వి. గీతా రోహిత, మరియు డా. చంద్రశేఖర్ ఆజాద్ బృందం ఉద్యోగులకు రాండమ్ బ్లడ్ షుగర్ రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్, బోన్ మినరల్ డెన్సిటీ మరియు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. మహిళల కోసం ప్రత్యేకంగా బ్రెస్ట్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించగా. 250 మందికి పైగా అధ్యాపకులు మరియు సిబ్బంది వైద్య పరీక్షలను చేయించుకుని సలహాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్సి. డిఎస్ విభాగాధిపతి డా. కె ఎస్ ఆర్ కె శర్మ, మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జె. శ్రీదేవి , పాల్గొన్నారు.

## నడిగూడెం సంతలో థామస్ షాప్ సందర్శించిన మాజీ సర్పంచ్



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్తదసెప్టెంబర్ 29**నడిగూడెం సంతలోని థామస్ షాప్‌ను మాజీ సర్పంచ్ చిల్లంచెర్ల సత్యనారాయణ మరియు వార్డు నంబర్ సభ్యుడు దున్న లింగన్న సందర్శించారు. ఈ సందర్భంగా షాప్ నిర్వాహకులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. స్థానికంగా వ్యాపారుల సమస్యలు, సంతలోని పరిస్థితులపై వారు చర్చించారు.

## వేణుగోపాలపురం ఎక్స్‌ప్లోడ్ వద్ద రోడ్డు ప్రమాదం

### ట్రాలీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన కారు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 29** నడిగూడెం మండలంలోని వేణుగోపాలపురం ఎక్స్‌ప్లోడ్ వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కాగిత రామచంద్రపురం నుంచి వేణుగోపాలపురం వైపు ట్రాలీ ఆటో వెళ్తుండగా, అదే మార్గంలో కరివిరాల గ్రామానికి చెందిన పలువురు కారులో కోదాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో నడుపుతున్న మునగాల మండలం రామసముద్రం గ్రామానికి చెందిన గంజాయి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలపై సర్పంచ్ దృష్టి



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 29** నడిగూడెం మండలంలోని గ్రామంలో సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మార్నింగ్ వాక్‌లో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఖరాబైన చేతిపంపును గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపించారు. బోరింగ్ మరమ్మతులతో స్థానికులకు నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అలాగే గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను సర్పంచ్ దున్నా శ్రీనివాస్ పర్యవేక్షించారు. గ్రామంలోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

## నారాయణపురం గ్రామానికి 7 సీఎంఆర్ చెక్కుల పంపిణీ



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 29** నారాయణపురం: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చేతుల మీదుగా నిర్వహించిన సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నారాయణపురం గ్రామానికి చెందిన ఏడుగురికి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా అట్లూరి పద్మ, నాగిరెడ్డి నితిన్ రెడ్డి, అట్లూరి జయమ్మ, అట్లూరి వెంకట్రాంరెడ్డి, అట్లూరి ప్రతాపరెడ్డి, నాగిరెడ్డి నవ్య, కంబాల మల్లేశ్వరిలకు సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో రేవంత్ అసలు టార్గెట్ ఇదేనా?

-మొదటిపేజీ తరువాయి

కేటీఆర్ గడపలోనే ఆయన వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా రాజకీయంగా మానసిక ఆధిపత్యం సాధించాలనేది కాంగ్రెస్ ప్రధాన వ్యూహం.సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించబోయే సభ సాధారణ ప్రభుత్వ కార్యక్రమంగానో లేదా పార్టీ సభగానో కాకుండా అంతకు మించి ఉండబోతోందన్న సంకేతం కనిపిస్తోంది. ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఇదే చర్చ కూడా. ఎందుకంటే రేవంత్ ఎంచుకున్నది సాధారణ నియోజకవర్గం కాదు. అది కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.అక్కడే భారీ బహిరంగ సభ.. దానికి ముందు నాలుగు కిలోమీటర్ల రోడ్‌షో.. రాష్ట్రంలోని కీలక మంత్రులు, కాంగ్రెస్ నేతల మోహరింపు.. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి జన సమీకరణ.. ఇవన్నీ చూస్తే రేవంత్ పర్యటనను కేవలం అభివృద్ధి కార్యక్రమాల పర్యటన కాదు.. మరోవైపు బీఆర్ఎస్ కంచుకోటలో కాంగ్రెస్ రాజకీయ శక్తిని ప్రదర్శించడ కూడా ఈ సభలోని రెండు ప్రధాన

## వైద్య చికిత్సలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ



మోతె: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.17,06,550 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.మోతె మండలానికి మొత్తం రూ.17,06,550 సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైనట్లు తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మోతే మండలంలో జడ్పీ సీఈఓ ఆకస్మికతనికి

**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 29** మోతే మండలంలో జెడ్పిసిఓ శిరీష మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసినారు తనిఖీలో భాగంగా పింఛన్ల వెరిఫికేషన్ ఆన్లైన్ చేయడము మరియు వెరిఫికేషన్ చేయడం గురించి ఎంపీడీవో ఎంపీ ఓ ఆరా తీశారు ఎంతవరకు తనిఖీ చేశారు ఏ విధంగా తనిఖీ చేస్తున్నారని రిజిస్టర్లు వెరిఫికేషన్ చేసి సంతకాలు చేయాలని సూచించారు వాటి వివరాలు





పూర్తిగా నమోదు చేయాలని సూచించారు వి బి జి రాంజీలో పనుల ప్రణాళికను మరియు ఎస్టిమేట్లను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు విబిజీ రాంజీలో పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీవో సందీప్ కుమార్ ఎం పి ఓ వంశీ మరియు ఈసీ శ్రీహరి పాల్గొన్నారుద

## విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ





**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పొనుగోడు దిశించర్ల జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఐఈసీ ఆఫీసర్ రాచకొండ విజయలక్ష్మి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్ఎం మామిళ్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు.వాసవి క్లబ్ అధ్యక్షుడు నీల రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సదుపాయాలు అందుతున్నాయని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు చారగొండ మల్లికాంబ, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## నేరేడుచర్లలో పోషణ మాసోత్సవం



**నేరేడుచర్ల, శుభోధయ డైనమిక్** నేరేడుచర్లలో సెక్టార్ స్థాయి 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక, సాంప్రదాయ ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు తీసుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చని చైర్‌పర్సన్ సూచించారు. సీడీపీఓ హడావత్ పార్వతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, ఆర్ఐ చంద్రకళ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. గర్భిణీలకు శ్రీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించి, పోషకాహార వంటకాలను ప్రదర్శించారు.

## పొంగులేటిపై చర్యలకు సిద్ధమేనా

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన చర్చనీయాంశమైంది. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఈడీ విచారణపై ఆరా తీస్తామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున ఈడీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించారు. రెండేళ్ల క్రితం జరిగిన సోదాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు తమకు చెప్పాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు.సోమవారం ఉదయం ఈడీ కార్యాలయం బయట బీఆర్ఎస్ నేతలు బైఠాయించి నినాదాలు చేస్తుండటంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొని పోలీసుల తీరుపై వాగ్వాదానికి దిగారు. అయితే, ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఒక ప్రతినిధి బృందం ఈడీ

## ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకథాన్, ఉచిత వైద్య శిబిరం





**మేడ్చల్--మల్కాజ్‌గిరి, శుభోదయ డైనమిక్** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా రామ్‌దేవ్‌రావు ఆసుపత్రిలో వాకథాన్‌తో పాటు ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. కుముదిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో నిర్వహించిన వాకథాన్‌ను లక్ష్మీ కమలాకర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యులు గుండె ఆరోగ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన ఉచిత శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. మొత్తం 406 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతె సెప్టెంబర్ 29** మోతే మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం మంగళవారం సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా ఏడీ వనజ మండల కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించడంతోపాటు లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

## కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నడిగూడెం మండలం సిఎంఆర్ చెక్కుల పంపిణీ సందర్భంగా



**కోదాడ శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 29**ఈరోజు కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నడిగూడెం మండలం ఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల నాయకులు నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాసులు కోడిపుంజుల గూడెం వెంకటరెడ్డి కేశపురం సర్పంచ్ రాజేష్ కోడిపుంజుల మాజీ సర్పంచ్ నీలిమ గాంధీ కాసాని శివకృష్ణ నడిగూడెం మండల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగినదిం

## పోషకాహారంపై అవగాహన కల్పించాలి



**శుభోదయ డైనమిక్ న్యూస్.మోతే:** సెప్టెంబర్ 299వ పోషణ మాసం సందర్భంగా మోతేలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మోతే సర్పంచ్ దోసపాటి అనురాధ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సీడీపీఓ శ్రీజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ భవాని సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంపై అవగాహన కల్పించారు.ఎక్స్‌టెన్షన్ అధికారులు జ్యోతి, లక్ష్మి అంగన్‌వాడీ టీచర్ల బాధ్యతలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయికి ఎంపికైన గురుకుల బాలికలు



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్** 29కోకో పోటీల్లో నడిగూడెం గురుకుల విద్యార్థినుల ప్రతిభనడిగూడెం: నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు మంగళవారం కోదాడలో నిర్వహించారు. అండర్--14 విభాగం కోకోలో నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన సిహెచ్. వర్షిణి, డి. దుర్గాభవాని, కె. బ్లెస్సీ, కె. దీక్ష జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు.
అదేవిధంగా అండర్--17 విభాగం కోకోలో ఎం. వాసవి, డి. మేఘన, ఎం. కీర్తన, ఏ. రిషిత జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులకు కోదాడ మండల విద్యాశాఖ అధికారి సలీం షరీఫ్, క్రీడల నిర్వాహకులు, ఫిజికల్ డైరెక్టర్లు అభినందనలు తెలిపి మెడల్స్ అందజేశారు.జిల్లా స్థాయికి ఎంపికైన బాలికలను పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడల్లో మరింతగా రాణించి పాఠశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాలికలను జిల్లా స్థాయికి ఎంపిక చేయడంలో కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ సుశీలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## రైతు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి: కలెక్టర్



**మేడ్చల్--మల్కాజ్‌గిరి, శుభోదయ డైనమిక్** జిల్లాలో రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా 70 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, ఇతర పరికరాలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను గుర్తించాలని, వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్నగర్ లో ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇన్చార్జికి ఘన సన్మానం



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్ :** ఎమ్మార్పీఎస్ నూతన జిల్లా ఇన్చార్జి మేళ్లచెరువు ముక్కంటికి ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. నా శిష్యుడు మెళ్ళచెరువు ముక్కంటి అంచలంచెలుగా ఎదగాలి అని ఆశీర్వదించారు. కుల సంఘాలు బలోపేతం కావాలని అన్నారు అలాగే జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య కి మరియు రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఐఎన్టియుసి పట్టణ అధ్యక్షులు మద్దం నాగేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నియోజకవర్గ ఇన్చార్జి బెల్లంకొండ గురువయ్య గౌడ్ హుజూర్నగర్ ఐఎన్టియుసి బ్లాక్ అధ్యక్షులు చిట్యాల అమర్నాథరెడ్డి ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి పాశం రామరాజు యాదవ్ ఐఎన్టియుసి జిల్లా నాయకులు చింతకాయల రాము ఐఎన్టియుసి అగ్రికల్చర్ యూనియన్ అధ్యక్షులు సయ్యద్ అజ్మతుల్లా షేక్ బాషా తోట బిక్షం మక్కా ఆదినారాయణ గొల్ల నాగయ్య గొట్టిముక్కుల నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## సర్వ మతాలకు సమ ప్రాధాన్యత

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మేడ్చల్--మల్కాజిగిరి, శుభోదయ డైనమిక్** ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని మతాలు, కులాలకు సమప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో హిందూ, ముస్లిం, క్రైస్తవుల కోసం ప్రత్యేక స్మశానవాటికల ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. క్రైస్తవుల స్మశానవాటికకు ప్రభుత్వ భూమి కేటాయించాలని పాస్టర్లు కోరగా, పెద్ద చెరువు తూర్పు వైపు ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భూమి కేటాయింపు పూర్తయిన అనంతరం అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA